కథ

**"చూడండి టీచర్ మా అమ్మ నన్నెలా తిడుతుందో బడికి పోవొద్దని" ఫిర్యాదు చేస్తున్న నీలను చూసి చిన్నగా నవ్వుతూ-"మళ్లీ ఏం గొడవొచ్చింది మీ యిద్దరికీ" అంది తులసి.**

# "ఆడ" పిల్ల

మూడు నాలుగు వేల జనాభాగల గోపాలపురంలో అయిదు తరగతులున్న బడిలో టీచర్‌గా పనిచేస్తుంది తులసి.

పొలాల నుండి వస్తున్న రైతులు, కూలీ జనం "నమస్కారమమ్మా-దండాలు తల్లీ" అంటూ పలకరిస్తుంటే వారితో ఆదరంగా మాట్లాడుతునే నీలతో సహా గూడెం వైపు నడుస్తోంది తులసి. నీల తాను చదువుకుంటానంటే అమ్మ ఎలా వద్దంటుందో నటిస్తూ చెబుతుంటే శ్రద్ధగా వింటోందామె.

"ఏయ్ నీలా మీ అమ్మ ఇటే వస్తుంది" నీల పక్కింటి కుర్రాడు దార్లో చెప్పాడు.

"వస్తే రానీ టీచరున్నారుగా నాకేం భయం" నీల ప్రత్యుత్తరం విన్నాక ఆ కుర్రాడు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

సాయం సంధ్యవేళ నీలతోసహా గూడెం లోకొస్తున్న తులసిని చూసిన నీల తల్లి యాదమ్మ-"అయ్యో తల్లీ నేను దీన్ని కొట్టలేదమ్మ. కొట్టానని చెప్పి మిమ్మల్ని లాక్కొచ్చినట్టుండాది" అంటూనే తులసి కూర్చోవటానికి మంచం వాల్చి "కూర్చో తల్లీ అయ్యగారు కుశలమా తల్లీ..రోజు అమ్మగార్ని సూద్దామని రావాలనుకుంటూనే రానేకపోయినాను. ఇదో కూలీ రోజులు గందా! ఏదో నాల్గురాళ్ళు కళ్ళ జూసేదీ రోజుల్నే మరి" అంది యాదమ్మ.


"నాయినమ్మ రోజూ అడుగుతూనే వుంది రాములు చెప్పలేదూ" తులసి కూర్చున్నాక అడిగింది.

"అయ్యో తల్లీ..ఆడికేటి గురుతు. ఆడికెన్ని పనులు. పొద్దుకూకెలబోతాడు. ఏ యాలకో వత్తాడు. మళ్లీ కోడి గుయ్యందే పొలంబోతాడు. కట్టవైతే పడతాడు గానీ ఆ సొమ్ములు మాత్రం మేం జూడం. ఏ కల్లు పాకకో, సారా కొట్టుకో జమైపోద్ది"

రోజంతా గొడ్డులా కష్టపడతారు. కూలీ డబ్బులన్నీ సారాకొట్టుపరం చేసి తాగి యింటికొచ్చిన భర్తను చూస్తే ఏ భార్య భరించగలదు. ఎందుకు తాగావంటే శరీర కష్టం మరవటాన్కి అంటారు. ఇంకా ఏమైనా అంటే తిట్టటాలు, కొట్టటాలు నానా రభస, యిది ఒక్క యాదమ్మ సమస్యే కాదు... ఎందరో యిల్లాళ్ళ వ్యథ.

"సరే రాములయ్యతో నేను మాట్లాడతానుగాని నీలనెందుకు స్కూల్ మాన్పించావ్"

"మాన్పించక నానేటి సెయ్యను తల్లీ, ఆడుపైన తేడు. ఇంట్లో పైన వుంచడు. అంతా సారాకొట్టుకెళ్లిపోతాది. నాను కూలికి బోవాల. ఈడపిల్లగాళ్ళను సాకటాన్కి నీల వుంటాదని"



"పిల్లల్ని సాకటాన్కి వుంటాదనా..లేక నీల చేత కూడా కూలీ చేయించొచ్చనా" కఠినంగా మాట్లాడింది తులసి.

ఎప్పుడూ నవ్వుతూ ఆదరంగా మాట్లాడే తులసి అంత కఠినంగా మాట్లాడేసరికి వెలవెలబోయింది యాదమ్మ ముఖం.

"నా తల్లీ..నా తప్పుకాయి. కానీ నానేటి సెయ్యను. ఆడు సొమ్ములివ్వడు. ఈ ఆరుగురి పొరగాళ్ళను నేనెట్టా సాకను తల్లీ..సోవులమ్మ పొరగాళ్ళను దాని యజమాని కూలికి రమ్మన్నాడు. గింజలు గొలిపిత్తానన్నాడు. అలా నీల గూడా దెత్తె నా కూలీ రాళ్ళకు దాని గింజలు జతై పిల్లగాళ్ళు కడుపునిండా దింటారని" కన్నీళ్ళు పెట్టుకుంది యాదమ్మ.

"మరి రాఘవనెందుకు స్కూల్‌కి పంపిస్తున్నావ్? వాడు కూడా కూలికి బోతే నీల కంటే ఎక్కువ గింజలు తెస్తాడే"

"అమ్మా.."

"ఏం అంత కష్టంగా తోస్తుంది? రాఘవ, నీల నీ పిల్లలే కదా! రాఘవ చదివే చదువే నీల ఎందుకు చదవకూడదూ నీల ఆడపిల్ల అనా.. ఆడపిల్ల 'ఆడ'పిల్లని నవమాసాలు మోసిన కన్నతల్లే చూస్తుంటే యింక మిగిలిన వారా పిల్లకు ఏం విలువిస్తారు యాదమ్మ. రాఘవ మగపిల్లవాడు నిన్నేదో ఉద్ధరిస్తాడు అని, నీల ఒక అయ్యచేతిలో పెడితే వెళ్ళిపోయేదే కదా అని తలుస్తున్నావు. కానీ నీల కూడా రాఘవలాంటిదే. రాఘవతో సమానంగా ఆమెకు కూడా చదువు కావాలి. చదువుకుని ఏం చేస్తుంది అనుకోకు. బ్రతుకు బాటను అందంగా మలుచుకోగల విజ్ఞానం అలవరచుకుంటుంది. లోకం పోకళ్ళ గురించి, సమాజపు లోటుపాట్లు గురించి అవగాహన ఏర్పరుచుకుంటుంది. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుంది" తులసి స్వరంలో గంభీరత.

"చదువు ఎందుకో మా అత్తయ్యను చూస్తే తెలియటం లేదూ. ఆమె గతం నీకు తెలియనిదా.." తులసి ఆగింది.

యాదమ్మ ఆలోచనలు విచ్చుకుంటున్నాయి.

అవును. ఆమె గురించి తన అత్తమామలు చెబుతుంటే అప్పట్లో బోలెడు ఆశ్చర్యంగా వుండేది. పెళ్లయ్యాక ఆమె చదువుకుందంటేనే యింకా ఆశ్చర్యంగా వుండేది.

మాధవశర్మగారు ఆవూళ్లో మోతుబరురైతు. అనసూయమ్మ తగిన యిల్లాలాయనకు. ముత్యాల్లా యిద్దరు పిల్లలు కాత్యాయని, శ్రీహరి. శ్రీహరి చిన్నవాడు. ఆనాటి పరిస్థితులననుసరించి కాత్యాయనికి సంగీతం, కుట్లు, అల్లికలు, యింటిపని, వంటపని నేర్పినంత శ్రద్ధగా విద్య నేర్పించలేదు. ఆడపిల్లకేం చదువులే ఒక అయ్యచేతిలో పెట్టేదే గదా! పొరుగూరు వెళ్ళి చదవాల్సిందేముంది? ఇంట్లో నేర్చిన అక్షరాలు చాలులే అనుకున్నారు తల్లిదండ్రులు.

మాధవశర్మగారి అక్కకొడుకు ఫణీంద్రతో చిన్ననాడే కాత్యాయని వివాహం నిశ్చయమైంది. కాత్యాయని

కృష్ణనివేదిత

పెద్దపిల్ల అయ్యేనాటికి ఫణీంద్ర పట్నంలో బి.ఏ. చదువుతున్నాడు. ఇంకా పై చదువులు చదవాలనుకుంటున్నాడతను. కాత్యాయని వ్యక్తురాలు కాగానే చిన్ననాడు అనుకున్న ప్రకారం కట్నకానుకలతో కూతుర్ని అక్కకోడలుగా చేసారు మాధవశర్మగారు. చదువుకుంటున్న ఫణీంద్రకు ఈ వివాహం యిష్టమా కాదా అన్నది ఎవరూ అడగలేదు. అతనూ చెప్పలేదు. కానీ ఫణీంద్రకు మాత్రం చదువుకున్న అమ్మాయిని భార్యగా చేసుకోవాలని వుండేది. అయితే అతని అభిప్రాయం చెప్పలేదేనాడు. మనసులో మాత్రం కాత్యాయని తనకే మాత్రం తగదంటూ ఆమె పట్ల అయిష్టత పెంచుకున్నాడు. అతని అయిష్టం అర్థం చేసుకోగల వయసుగాని, అనుభవంగాని లేవామెకు. ఆమె మీది అయిష్టత తనతో చదివే అమ్మాయి మీద యిష్టంగా మారింది. ఆ యిష్టం పెళ్ళి వరకూ దారితీసింది.

తమ అభీష్టం నెరవేరటానికి కాత్యాయని అడ్డుగా తోచింది. తన పై చదువులకోసం ఆమె సంతకాలు కావాలంటూ భార్యతో చాలా కాగితాలపై సంతకాలు చేయించుకున్నాడు. నిజమని నమ్మిన కాత్యాయని ఆ కాగితాలపై ఏంవుందో చదవకనే సంతకాలు చేసేసింది. అవే త్వరలో తన జీవితాన్ని విచ్ఛిన్నం చెయ్యబోతున్నాయని ఊహించలేదామె.

ఆ పత్రాలు తన వివాహబంధాన్ని విచ్ఛిన్నం చేసేవని, వాటిపై తాను సంతకాలు చేసిందని తెలిసినప్పుడు కాత్యాయని ఖిన్నురాలైంది. కాత్యాయని ఎంత వేడుకున్నా వినకుండా ఫణీంద్ర రెండో వివాహం చేసుకునే ప్రయత్నం మానలేదు.

కన్నీళ్ళతో పుట్టింటికి చేరిన కాత్యాయని విషయం వివరించింది తండ్రికి. విషయం తెలిసిన మాధవశర్మగారు అక్కతో కలిసి పట్నం వెళ్ళారు. అప్పటికే ఫణీంద్ర యింకో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. తల్లి, మేనమామల ముఖంపైనే తలుపేసాడు.

మాధవశర్మగారు అల్లుడు చేసిన వంచనకు దుఃఖించినా పిల్ల భవిష్యత్తు పాడు చేసిన వ్యక్తిపై తగిన చర్య తీసుకోవాలంటూ కోర్టుకు అర్జీపెట్టుకున్నారాయన. మంచి ప్లీడర్ని పెట్టి పట్టుదలగా కేసు గెల్చారు.

మోసగించి చేయించిన సంతకాలతో విడాకులు, రెండో వివాహం చెల్లవంటూ కేసు కొట్టేసారు. ఫణీంద్రకు ఆరునెలల జైలు శిక్ష పడింది. కాత్యాయనితో వివాహ జీవితం కొనసాగించాలని తీర్పు చెప్పారు.

కేసు గెలిచాక మాధవశర్మగారి నిర్ణయం అందర్నీ ఆశ్చర్యపరిచింది. "కోర్టువారు శిక్ష విధించినా అలాంటి నయవంచకుడితో తన కూతురు జీవితం సాగించదని, తను ఈ కేసు గెలవటం ఇలాంటి అల్లుళ్ళు ఉన్నారని ఈ ప్రపంచంలోని ఆడపిల్లల తండ్రులను హెచ్చరించటమే" నని చెప్పి కోర్టులో నుండి కూతుర్ని తీసుకువచ్చారాయన.

మర్నాడే కూతుర్ని పిల్చి "వాడు నిన్ను వంచించాడని నువ్వు కుమిలిపోతూ ఈ సంఘం ముందు తల వంచాల్సిన పని లేదు తల్లీ. నువ్వు సగర్వంగా తలెత్తుకు తిరగాలనే ఈ పని చేసాను నేను. ఈ ఆస్తిలో సగభాగం నీది. నువ్వేమి చెయ్యాలనుకుంటున్నావో చెప్పు. నీ నిర్ణయాన్ని అమలుచేసి నీ జీవితంలో నేనవివేకంతో చేసిన లోటును భర్తీ చేస్తాను. చెప్పుతల్లీ నువ్వేం చెయ్యాలనుకుంటున్నావో నిర్భయంగా చెప్పు" అన్నారాయన.

"మీ యిష్టం నాన్నా" అనలేదామె. "నేను చదువుకుంటాను నాన్నా. ఫణీంద్రలాంటి ఎందరో నయవంచకుల వంచనకు గురి అవుతున్న స్త్రీలకు మార్గదర్శినౌతాను" ఆ రెండు మాటలే ఆమె మాట్లాడింది.

ఆమె నిర్ణయాన్ని ఆమోదించటమే కాదు అందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ ఆ క్షణంలోనే ప్రారంభించారాయన.

మళ్ళీ ఆమె ఏనాడూ వెనక్కి తిరిగి చూడలేదు. అలా ఆమె అయిదేళ్ళనాడు చేపట్టిన బలపాన్ని పద్ధెనిమిదేళ్ళ నాడు తిరిగి పట్టుకుని రాయటం, చదవటం ప్రారంభించింది. ఆ ప్రారంభమే ఆమె జీవితానికి శుభారంభమైంది.

అనుకున్నట్టుగానే ఆమె లాయర్ అయ్యింది.

ఎందరో అభాగ్యుల పాలిట కల్పవల్లి అయ్యింది.

లాయర్ కాత్యాయని అంటే తెలియని వారెవరూ లేరా చుట్టుపట్ల.

పట్టుదలతో, అకుంఠిత దీక్షతో కృషి చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఎందరికో మార్గదర్శకురాలైంది.

* * *

"అత్తయ్యలా ఎందరు ముందుకు సాగగలరు. ఆమె ఆనాడు అందరిలా కృంగిపోయి ఈ గడపలోనే నా జీవితం అనుకుంటే వంట యింటికే పరిమితమై వచ్చేపోయేవారికి వండిపెడుతూ జీతం బత్తెంలేని వంట మనిషిగా మిగిలేది తప్ప యింత విజ్ఞానాన్ని సముపార్జించి యింత ఉన్నతిని సాధించేదా? యిందరి అభాగ్యుల కన్నీటిని తుడవగలిగేదా?

తాతయ్య, నాయనమ్మ ఆమె 'ఆడ'పిల్ల అని అనుకుని ప్రోత్సహించకపోయివుంటే యింతటి ఉన్నత శిఖరాన అత్తయ్యను చూడగలిగేవారమా! తన కన్నీటినే పన్నీటి జల్లుగా మార్చుకోవటానికి ఆమె ఎన్నుకున్నది విద్య. ఆ విద్యే ఆమెను ఉన్నత శిఖరాన నిలబెట్టగలిగిందన్నది మనమెరిగిన సత్యం. విద్య ఉదర పోషణ నిమిత్తం కోసమే కాదు యాదమ్మ. విజ్ఞానాన్ని పెంచటానికి, వివేకంతో ఆలోచించి అజ్ఞానాన్ని పారద్రోలటానికి. ఆడపిల్లకి ఎందుకు చదువనుకుంటున్నావు గానీ, ఈ ఆడపిల్లే ఆడ-పిల్లై ఆ యింటి సంసారరథాన్ని సవ్యంగా నడపాల్సింది. భార్యగా, తల్లిగా ఈ బాధ్యతను చేపట్టే ఆడపిల్ల తనలోని అజ్ఞానాన్ని పారద్రోలుతూ విషయాన్ని విజ్ఞానానికి జోడించి ఆలోచించటానికి అక్షరజ్ఞానం కలిగివుంటే తప్పేముంది యాదమ్మ. దానికోసం నీల నెందుకు ప్రోత్సహించవు నువ్వు"

తులసి మాటలలో నిజాన్ని గుర్తించటానికి ప్రయత్నించసాగింది యాదమ్మ.

తులసి వెళ్ళిపోయినా యాదమ్మ అలాగే కూర్చుండిపోయింది.

తులసి మాటలే ఆమె చెవులలో మారుమ్రోగుతున్నాయి.

నిజమే తులసి అన్నట్లు రాఘవ, నీల యిద్దరూ తన పిల్లలే. మరెందుకు రాఘవను చదివించాలనుకుంటుంది? రాఘవకన్నా నీల శ్రద్ధగా చదువుతున్నా తనెందుకు నీలను చదువు మాన్పించాలనుకుంటుంది?

ఆడపిల్ల అయినా మగపిల్ల వాడైనా యిద్దర్నీ నవమాసాలు మోసి కన్నదే తాను.

నీల వాకిలి ఊడుస్తుంది. కళ్ళాపి జల్లుతుంది. రాఘవ నీళ్ళు మోస్తుంటే నీల పంపు కొడుతుంది. అది కూడా వాడితో సమానంగానే కష్టపడుతుంటే మరెందుకు భేదం?

ఎక్కడుంది లోపం?

తన ఆలోచనలలోనే... తన మాటలలోనే... తన చేతలలోనే..ఆడపిల్ల ఎప్పటికైనా ఆడ-పిల్లే అన్న తన భావనలోనే..ఆడపిల్ల కూడా తనకు తోడునిచ్చేదే అన్నది తను తెలుసుకున్న రోజున నీల ఆడ-పిల్లే కాదు.

అప్పుడు నీలకు, రాఘవకు భేదం లేదు.

"నీలా దీపం తోమి ఎల్గించి బెట్టినా..అన్నతో కూడి సదువుకో. పొద్దున బడికి బోదువు. తొరగా అన్నం దిను" అన్నం కెలుకుతూ కూర్చున్న నీలతో అంది యాదమ్మ.

నీల ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. *

